క్లుప్తంగా

బీజేపీలో పలువురి చేరిక



దోమకొండ : మండలానికి చెందిన పలువురు వివిధ పార్టీల నాయకులు సోమవారం బీజేపీలో చేరారు. దోమకొండకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, వార్డుసభ్యులు సిద్ధరాములు, సంఘమేశ్వర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు చెన్నం సంతోష్‌రెడ్డితో పాటు మరికొంత మంది యువకులు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు మద్దురి భూపాల్‌రెడ్డి, నాయకులు పన్యాల రవీందర్‌రెడ్డి, అనుపాటి నరేందర్‌రెడ్డి, తిప్పాపురం రవి, చందు, శేఖర్ తదితరులు ఉన్నారు.

నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి



బాన్సువాడ రూరల్ : ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా, ప్రైవేట్ రంగంలో ఉద్యోగ సాధన కోసం విద్యార్థులు దృష్టిసారించాలని, దీనికోసం నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని ప్రిన్సిపల్ గంగాధర్ సూచించారు. సోమవారం మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో దేశ్‌పాండే ఫౌండేషన్ సహకారంతో డిగ్రీ విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దేశ్‌పాండే ఫౌండేషన్ నిజామాబాద్ మేనేజర్ అజీమ్, కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ వినయ్‌కుమార్, అధ్యాపకులు కృష్ణ, శంకర్‌రావు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లలో అభివృద్ధి శూన్యం



లింగంపేట(ఎల్లారెడ్డి): జహీరాబాద్ పార్లమెంటు సభ్యుడు బీబీ పాటిల్ పదేళ్లుగా మండలానికి చేసింది జీరో అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ అన్నారు. సోమవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రెండు పర్యాయాలు గెలిచినా మండలానికి ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు గెలిచిన 100 రోజుల్లోనే నియోజక వర్గంలో 280 బోరుబావులు తవ్వించి ప్రజల దప్పిక తీస్తున్నారన్నారు. మండలంలో 18 బోర్లు వేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు సుప్పాల రాజు, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్ తదితరులున్నారు.

ల్యాప్‌టాప్ అందజేత



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎంబీఏ చదువుతున్న విద్యార్థి మౌనికకు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డి చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌ను అందజేశారు. పసులపూడి చిన్నరావు రూ.40 వేల ఆర్థికసాయంతో మౌనికకు ల్యాప్‌టాప్‌ను అందించినట్లు రోటరీ అధ్యక్షుడు పోలబోయిన సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రధాన కార్యదర్శి పి.రాజ నర్సింహారెడ్డి, కోశాధికారి తోర్నాల సుధాకర్, ప్రతినిధులు బి.నాగభూషణం, వై.శంకర్, కైలాస్ చంద్రశేఖర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీషర్ట్స్ అందజేత



మాచారెడ్డి : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ సెవెన్ హార్స్ ఆర్గనైజేషన్ ఎన్జీవో ఆధ్వర్యంలో భవానిపేట్ చిల్డ్రన్ హోం విద్యార్థులకు టీషర్ట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో ప్రధాన కార్యదర్శి మసూద్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్‌చౌహాన్, చిల్డ్రన్‌హోమ్ ప్రతినిధులు సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల నాయీబ్రాహ్మణ సంఘం కార్యవర్గాన్ని సోమవారం జిల్లా ఉపాధ్యక్షుడు మంగళి బాలకిషన్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మంగళి నర్సింలు, ప్రధాన కార్యదర్శి స్వామి, కోశాధికారులు రమేశ్, లక్ష్మీనారాయణ, సలహాదారులు సాయిలు ఎన్నికయ్యారు.

ఉగాది వేడుకకు సర్వం సిద్ధం

- ముస్తాబైన దేవాలయాలు
- పంచాంగ శ్రవణం, ఎడ్లబండ్ల ప్రదర్శనలకు ఏర్పాట్లు



లచ్చాపేట ఉన్నత పాఠశాలలో పంచాంగ శ్రవణం చేస్తున్న వేదపండితుడు



తాడ్వాయి శివారులో ముస్తాబైన గ్రామ దేవత ఆలయాలు



రామారెడ్డిలో పండుగ సామగ్రి అందిస్తున్న వివేకానంద ట్రస్ట్ సభ్యులు



ఉత్సవాలకు ముస్తాబైన మత్తడి పోచమ్మ ఆలయం

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలో మంగళవారం జరిగే ఉగాది పర్వదినానికి పలు దేవాలయాలు ముస్తాబయ్యాయి. తాడ్వాయి మండల కేంద్రంతో పాటు కృష్ణాజీవాడి, ఎర్రాపహాడ్, నందివాడ, బ్రాహ్మణపల్లి, బ్రహ్మాజీవాడి, చందాపూర్, కరడ్‌పల్లి, చిట్యాల తదితర గ్రామాలలో గల శివాలయాలు, హనుమాన్, శ్రీరాముని, దేవాలయాలతో పాటు గ్రామ దేవతల దేవాలయాలను వివిధ రంగులతో తీర్చిదిద్ది ముస్తాబు చేశారు. ఉగాది సందర్భంగా ఈ ఆలయాల చుట్టు ఎడ్లబండ్ల ప్రదర్శన , జాతర ఉంటుందని ఆయా గ్రామాల పెద్దలు తెలిపారు.

పాఠశాలల్లో..

మాచారెడ్డి : మండలంలోని లచ్చాపేట ఉన్నత,కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితుడు జయరాం శర్మ విద్యార్థులకు పంచాంగ శ్రవణం వినిపించారు. కొత్తపల్లి పాఠశాలలో ఓ విద్యార్థి పురోహితుడి వేషధారణలో పంచాంగాన్ని వినిపించాడు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేశ్వర్ రెడ్డి, ప్రశాంతి ఉపాధ్యాయులు ఉన్నారు.

పోలెలు, పచ్చడి సామగ్రి పంపిణీ

రామారెడ్డి : ఉగాది సందర్భంగా రామారెడ్డి గ్రామంలోని నిరుపేదలకు వివేకానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో 20 నిరుపేద కుటుంబాలకు, ఉగాది పచ్చడి పోలెలు చేసుకోవడానికి కావాల్సిన ముడి సరుకులను ట్రస్ట్ సభ్యులు సోమవారం పంపిణీ చేశారు. ఈ ట్రస్ట్ సభ్యులు నిరుపేద కుటుంబాలకు కావాల్సిన నిత్యావసర సరుకులను గతంలో కూడా పంపిణీ చేశారు. యాచకులకు అన్నదానం చేస్తున్నారు. గుడిసెలో బతుకుతున్న ఓ అవ్వకు వర్షానికి తడవకుండా బార్దాన్ కప్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నరేష్‌రెడ్డి, నాగరాజు, సోను, అవినాష్ , మధు, రాకేష్, రాజేష్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

నేడు పంచాంగ శ్రవణం

మద్నూర్(జుక్కల్) : మండలంలోని పలు ఆలయాల్లో మంగళవారం నూతన సంవత్సరం ఉగాది పండగ సందర్భంగా పంచాంగ శ్రవణ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి జరిగినట్లు అర్చకులు వెంకట్ మహారాజ్ తెలిపారు. శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పండగ సందర్భంగా మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయం, మద్నూర్‌లోని విఠలేశ్వర ఆలయం, బాలాజీ మందిర్, సాయిబాబా ఆలయం, సంతోషిమాతా ఆలయం తదితర ఆలయాల్లో ఉగాది పచ్చడి, పంచాంగ శ్రవణ కార్యక్రమం ఉన్నట్లు అర్చకులు తెలిపారు.

మత్తడి పోచమ్మ ఉత్సవాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రం సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయం ఉగాది ఉత్సవాలకు ముస్తాబైంది. ప్రతీ సంవత్సరం ఉగాధి పర్వదినాన్ని పురస్కరించుకొని వారం రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. మంగళవారం ఎడ్లబండ్ల ప్రదర్శన, బుధవారం రథోత్సవం, శుక్రవారం కుస్తీ పోటీలు, శని, ఆది వారాల్లో ముగింపు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్) : ఉగాది ఉత్సవాలకు నిజాంసాగర్, మహమ్మద్‌నగర్, జుక్కల్ మండలాల్లోని గ్రామాల్లో ముత్యాలపోచమ్మ, నల్లపోచమ్మ, బారెడు పోచమ్మ ఆలయాలను ముస్తాబు చేశారు. అమ్మవార్ల ఆలయాలకు రంగులు దిద్దడంతో పాటు పచ్చని పందిళ్లు వేశారు. ఉగాది పర్వదినం రోజున బోనాలు, ఎడ్ల బండ్ల ప్రదర్శన, పంచాంగ పఠనం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

జాబ్‌కార్డులు వచ్చేలా చూడాలి



మాట్లాడుతున్న పీడీ చందర్‌నాయక్

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనుల్లో కూలీల శాతాన్ని పెంచాలని పీడీ చందర్‌నాయక్ అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలన్నారు. జాబ్‌కార్డులు లేనివారికి జాబ్ కార్డులు వచ్చేలా కృషిచేయాలని సూచించారు. కూలీలకు వారానికి ఒకసారి వారి ఖాతాలో డబ్బులు పడేలా చూడాలన్నారు. కృష్ణాజీవాడి, ఎండ్రియాల్, సంతాయిపేట్, చిట్యాల గ్రామాల్లో నడుస్తున్న ఉపాధి హామీ పనులు, నర్సరీలను పరిశీలించారు. నర్సరీలో తప్పనిసరిగా 10వేల మొక్కలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, ఎంపీవో హెక్సిఫా రాణి ,ఏపీవో సృతి, ఏపియం రవిందర్, గ్రామ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంటులు, ఫీల్డు అసిస్టెంటులు పాల్గొన్నారు.

నియామకం

స్పోక్స్‌పర్సన్‌గా షౌకత్‌అలీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని చందాపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ షౌకత్‌అలీ సోమవారం తాడ్వాయి మండల స్పోక్స్‌పర్సన్‌గా ఎంపికైనట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.

ఎల్లారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వినోద్‌గౌడ్



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వినోద్‌గౌడ్‌ను కాంగ్రెస్ నాయకులు నియమించినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుర్మ సాయిబాబా సోమవారం తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా నియామకమైన వినోద్‌గౌడ్‌ను కాంగ్రెస్ నాయకులు అభినందించారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా సాయిబాబా



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మండల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా మర్లు సాయిబాబాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు సోమవారం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా సాయిలు, ప్రధాన కార్యదర్శిగా కాంతారావు, కోశాధికారిగా లక్ష్మణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

బీఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా..



రాజంపేట : రాజంపేట బీఆర్ఎస్ నూతన ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా గణేశ్ నాయక్‌ను నియమిస్తూ ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గణేష్ నాయక్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని రాఘవపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రవీణ్‌కుమార్ సోమవారం నూతనంగా దుస్తులను అందించారు. ప్రవీణ్ కుమార్ వారి తల్లితండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థులకు నూతనంగా దుస్తులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూర్తి, మేఘమాల,శ్రీలత తదితరులున్నారు.

జీపీకి వైకుంఠ రథం అందజేత



భిక్కనూరు : మండలంలోని జంగంపల్లి జీపీకి వైకుంఠ రథంను గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు సోమవారం అందజేశారు. గ్రామాభివృద్ధి కమిటీ రూ. 2.30 లక్షలు వెచ్చించి వైకుంఠ రథాన్ని తయారు చేయించి జీపీకి అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో, గ్రామ ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ శివరాములు, మాజీసర్పంచ్ నర్సింలు యాదవ్, జీపీ కార్యదర్శి బాబు తదితరులున్నారు.

ఆరోపణలను నిరూపించాలి



భిక్కనూరులో మాట్లాడుతున్న ఎంపీపీ గాలిరెడ్డి

భిక్కనూరు : కామారెడ్డి బీఆర్ఎస్ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తన స్థాయిని దిగజార్చుకుని మాట్లాడుతున్నారని ఇది ఆయనకు తగదని భిక్కనూరు ఎంపీపీ గాలిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన భిక్కనూరులో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరన్‌రెడ్డి, కిసాన్‌విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గొండ్ల సిద్దరాములుతో కల్సి ఆయన మాట్లాడారు. తాను డబ్బులు తీసుకుని పార్టీ మారినట్లు ఆరోపించారని అది నిరూపించాలన్నారు. తాను ప్రజల సహకారంతో ఎంపీటీసీగా గెలిచానన్నారు. కామారెడ్డిలో గంపగోవర్ధన్ తనను అనరాని మాటలు అన్నారని అప్పుడే పార్టీ మారాలని నిర్ణయించుకున్నానన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్‌పట్టణాధ్యక్షుడు అందే దయాకర్‌రెడ్డి, నేతలు కోకస్వామి, నర్సరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

అమావాస్య పూజలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో మహిళలు సోమావతి అమావాస్య పూజలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సోమావతి అమావాస్యను పురస్కరించుకుని శివాలయంలో ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం రావి, వేప చెట్లుకు పూజలను నిర్వహించారు.

నేటి నుంచి నల్లపోచమ్మ ఉత్సవాలు



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని కొమలంచ గ్రామంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నల్లపోచమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మొదటి రోజు మంగళవారం నల్లపోచమ్మకు ఎడ్లబండ్ల ప్రదర్శన, రెండవ రోజు బుధవారం బోనాల ప్రదర్శన, రథోత్సవం, మూడవ రోజు గురువారం మల్లయోదులకు కుస్తీపోటీలు నిర్వహిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు.

నృసింహాలయంలో హుండీ లెక్కింపు



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలోని హుండీలను సోమవారం లెక్కించారు. మూణ్నెళ్లకు సంబంధించిన ఏడు హుండీలను అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ సమక్షంలో లెక్కించగా రూ. 4,43,875 వచ్చినట్లు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్ రావు, సిబ్బంది సంతోష్, లక్ష్మణ్, డైరెక్టర్లు ఉన్నారు.

వరిపంట పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండల కేంద్రంతో పాటు నర్వ గ్రామ శివారుల్లో సాగు చేసిన వరి పంట పొలాలను సోమవారం మండల వ్యవసాయ శాఖ అధికారి అమర్ ప్రసాద్ పరిశీలించారు. ఆయా గ్రామాల్లో కోతకు వచ్చిన వరి పంటలు కాండం కుళ్లు, పాంపాడ, అగ్గి తెగుళ్లు ఆశించడంతో తెగుళ్ల నివారణకు పిచికారి చేయాల్సిన పురుగు మందులను రైతులకు వివరించారు. ఆయన వెంట రైతులు డాకయ్య, బాలాగౌడ్, బిట్ల, అశోక్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మైనారిటీలు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రానికి చెందిన మైనార్టీ నాయకులు సోమవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యేను హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన పలు సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించినట్లు తెలిపారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే మత్తడి పోచమ్మ జాతరకు రావాలని ఆహ్వానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నయీం, ఇబ్రహీం, కిరణ్, అబ్దుల్ ఖుద్దూస్, నోమన్, సోహెల్ తదితరులు ఉన్నారు.

తిర్మలాపూర్‌లో ఇఫ్తార్



బాన్సువాడ రూరల్ : రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని తిర్మలాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు తూప్రాన్ శంకర్‌గౌడ్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు మహ్మద్ గౌస్, గ్రామ అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు, ఉపాధ్యక్షులు మొగులయ్య తదితరులున్నారు.

మురుగు సమస్యను పరిష్కరించాలి



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మైలారం గ్రామంలోని ఓ కాలనీలో పైప్‌లైన్ జామ్ అవ్వడంతో నీటి సమస్య ఏర్పడిందన్న విషయం ఎంపివో రాము దృష్టికి రావడంతో ఆ ప్రదేశాన్ని వెంటనే పరిశీలన చేశారు. సోమవారం పంచాయతీ కార్యదర్శితో సమక్షంలో పైపులైన్ తవ్వించి సమస్యను పరిష్కరించాలని సూచించారు. జీపీ కార్యదర్శి సవిత, స్థానిక ప్రజలు ఉన్నారు.

అక్రమంగా మొరం తవ్వకాలు



మొరంను తరలిస్తున్న ట్రాక్టర్

భిక్కనూరు : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో అక్రమంగా మొరం తవ్వకాలు జోరుగా కొనసాగుతున్నాయి. వీటిని ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. కొందరూ రాజకీయ నేతలు అక్రమంగా మొరంను తవ్వించి ట్రాక్టర్ల ద్వారా తరలించి విక్రయించుకుంటున్నారు. ఈ విషయమై పలువురు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. మొరం తవ్వకాలపై ఎవరైనా అధికారులకు సమాచారం అందిస్తే సదరు అధికారులు సమాచారం ఇచ్చిన వారి పేర్లను మొరం వ్యాపారం చేస్తున్న నేతలకు చెబుతుండడంతో వారు ఫిర్యాదు చేసినవారిని బెదిరిస్తున్నారన్నారు. మూడు రోజులుగా మండల కేంద్రం సమీపంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్ సమీపంలోని ఘోరకోని కుంట నుంచి పొక్లెయిన్లతో జోరుగా ట్రాక్టర్ల ద్వారా మొరాన్ని తరలిస్తున్నారు.

కూలీల హాజరు తప్పనిసరి





మగ్దుంపూర్ శివారులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో గంగాధర్, లింగంపేటలో..

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్, మహమ్మద్ నగర్ మండలాల్లోని పడంపల్లి, బిజ్జల్ వాడి, మగ్దుంపూర్ జీపీలో ఉపాధి పనులను సోమవారం ఎంపీడీవోలు శ్రీనివాస్, గంగాధర్ పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. పనుల చేస్తున్న ప్రదేశాల్లోనే కూలీలు హాజరును తప్పని సరిగా తీసుకోవాలన్నారు. ఎండ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారి వెంట ఫీల్డ్ అసిస్టెంట్లు గంగారాం తదితరులు ఉన్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని పొల్కంపేట, కన్నాపూర్ గ్రామాల్లో సోమవారం ఉపాధి హామీ పనులను ఎంపీడీవో నరేశ్ పరిశీలించారు. ఉదయం 10:30 గంటల వరకు పనులు చేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. ప్రతీ గ్రామ పంచాయితీలో 150 నుంచి 200 మంది కూలీలు పనుల్లో పాల్గొనేలా చూడాలని సూచించారు. కూలీల మస్టర్లను పరిశీలించారు. నర్సరీలను తనిఖీ చేశారు. ఆయన వెంట కార్యదర్శి అశ్వక్, క్షేత్ర సహాయకుడు వెంకటేశం, మేట్లు, కూలీలు ఉన్నారు.

సంక్షిప్తం

బీఆర్ఎస్‌కు మాజీ జెడ్పీటీసీ రాజీనామా



గాంధారి : గాధారి మాజీ జెడ్పీటీసీ, సీనియర్ నాయకుడు తానాజీ రావు సోమవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. కేంద్ర మంత్రి, తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి సమక్షంలో నేడు బీజేపీలో చేరుతున్నట్లు తానాజీ రావు తెలిపారు. త్వరలో గాంధారి మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసి తన అనుచరవర్గంతో బీజేపీలో భారీ చేరికలు ఉంటాయన్నారు.

దాతకు సన్మానం

భిక్కనూరు : మండలంలోని తిప్పాపూర్ శ్రీ వెంకటేశ్వరాలయం అభివృద్ధికి కామారెడ్డి పట్టణానికి చెందిన కాశీనాథ్‌రావు రూ. 5116 సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ తాటిపల్లి సిద్దరాములు విరాళ దాతను సన్మానించారు. దేవాలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కుంట లింగారెడ్డి, వైద్య లక్ష్మణ్‌రావు, పూజారి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేట తండాకు చెందిన వ్యక్తి రత్నావత్ శంకర్‌కు సెల్‌ఫోన్‌ను అప్పగించినట్లు ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. శంకర్ గత కొద్ది రోజుల క్రితం ఫోన్‌ను పోగొట్టుకోవడంతో ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడంతో ట్రేస్ చేసి కనుక్కున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని ఎంపీవో రాము అన్నారు. సోమవారం మండలంలోని బొమ్మన్‌దేవ్ పల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలన చేశారు.

ముదిరాజ్ అభ్యర్థులను గెలిపించుకోవాలి



కామారెడ్డి అర్బన్ : రాష్ట్రంలో ముదిరాజ్ ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ముదిరాజ్ రాష్ట్ర మహాసభ తీర్మానించినట్లు ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రాజేశ్వర్, జిల్లా అధ్యక్షుడు జి.భిక్షపతి అన్నారు. సోమవారం ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాష్ అధ్యక్షతన బోడుప్పల్‌లో జరిగిందన్నారు. లోక్‌సభ ఎన్నికల ముగిసిన అనంతరం జూన్ నెలలో కామారెడ్డి జిల్లా సమావేశం నిర్వహిస్తామన్నారు. లోక్‌సభ అభ్యర్థులుగా ఉన్న కాసాని జ్ఞానేశ్వర్, నీలం మధు, ఈటెల రాజేందర్‌లను గెలుపించుకోవాలని పిలుపునిచ్చారు.